


## వైభవంగా రథోత్సవం

గూడూరు, జూన్ 23, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మ వార్లకు విశేషాలంకరణ ఏర్పాటు చేసి హోమం నిర్వహించారు. మంగళవాయిద్యాలతో భక్తులు గోవింద నామ స్మరణతో పట్టణ పురవీధుల్లో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ : కలెక్టర్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 23, ప్రభాతవార్త

ఈ నెల 24న సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఈ మీ కోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇకపై ప్రతి సోమవారం సదరు మీ కోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించ బడుతుందని జిల్లా కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్ఎం శనివారం తెలిపారు. అలాగే డివిజన్ మండల కార్యాలయాల్లో, తహశీల్దార్, ఎంపిడిఓ, మున్సిపల్ కార్యాలయాలలో సంబంధిత అధికారులు విధిగా పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు.

## గిరిజన గురుకుల పాఠశాలలో
# 8 మంది విద్యార్థులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

గూడూరు, జూన్ 23, ప్రభాతవార్త

గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో తాగునీరు కలుషితమై 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన చోటు చేసుకుంది. వీరంతా శనివారం భోజన సమయంలో తాగునీటి కొరకు వెళ్లగా పాఠశాలలో ఉన్న ఆర్‌వో మినరల్ వాటర్ పనిచేయకపోవడంతో పక్కనే నీటి సరఫరా చేసే పైపు లైన్‌లో నీటిని త్రాగడంతో అస్వస్థతకు గురైయ్యారు. అనంతరం ప్రిన్సిపాల్, వార్డెన్‌లు గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు ఆరు మందిని నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనంతరం ఇద్దరు విద్యార్థులకు పాఠశాలలో స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూధన్ బాబు, వార్డెన్ కోటేశ్వర రెడ్డిలు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి నాయకులు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, శ్రీకి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, శివకుమార్‌లు పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలించి, జరిగిన సంఘటన పై ఆరా తీశారు. ఎటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వార్డెన్, ప్రిన్సిపాల్‌లకు సూచించారు.

# హోటళ్ళలో ఆహారపదార్థాల తనిఖీ ఏదీ!?

## తిరుపతిలో నాణ్యతలేకున్నా యదేచ్ఛగా విక్రయాలు -యాత్రికుల పేరుతో వ్యాపారుల దోపిడీ

ప్రభాతవార్త-తిరుపతి:



వేలసంఖ్యలో నిత్యం వస్తున్న యాత్రికులు, భక్తులు....వారికి అవసరమైనపుడు అల్పాహారం, భోజనం, ఇతరత్రా ఆహారపదార్థాలు అందించేందుకు సిద్దంగా ఉంటున్న వందలసంఖ్యలో హోటళ్ళు, వెరసి యాత్రాస్థలం కావడంతో నాణ్యత తీసికట్టుగా తయారైనా అడిగే అధికారులే లేకపోవడం విచారకరం. హోటళ్ళ ముందు ఇడ్లీ,దోసె,చపాతీ, ఫ్రైడ్‌రైస్‌లు, భోజనాలు ఇలా వాటిపై ఎగసిపడుతున్న ధుమ్ము,ఈగలు ఇవేమీ హోటళ్ళ వ్యాపారులకు కనబడటంలేదు. కనీసం వీటిపై మూతలుకూడా ఉండవంటే భయమేస్తోంది. యాత్రికుల పేరుతో ఆ పూటకు ఆపూట కొత్తవాళ్ళు బయటనుండి ఇక్కడకు వచ్చి తిరుమలకు వెళ్ళడమో...తమ వ్యాపారాలు చూసుకుని తిరుగుప్రయాణం కావడం జరుగుతుంది. ఇలాంటి వారి అవకాశాన్ని ఆసరాగా తీసుకున్న పలువురు హోటళ్ళ వ్యాపారులు నాణ్యత అనేది మరచిపోయారు. ఇందుకు తాజాగా తిరుపతిలోని పిఎస్4 హోటల్‌లో నాలుగురోజుల క్రిందట ఓ భక్తబృందం ఆర్డరిచ్చిన అల్పాహారంలో విషపూరితమైన జెర్రి చనిపోయి ఉండటంతో ఆ భక్తులు ఆందోళన చెందారు. చపాతీలో కాలిచనిపోయిన జెర్రి కనిపించడంతో వాళ్ళంతో హడలిపోయారు. ఓ స్టార్‌హోటల్‌లా పేరున్న అందులోనే ఇంతటి దారుణం జరిగిందంటే ఇక చిన్నాచితకా హోటళ్ళలో, మెస్‌లు, ఫాస్ట్‌పుడ్ కేంద్రాలలో పరిస్థితి ఏపాటిదో అర్ధమవుతుంది. నగరంలోని దాదాపు చిన్నచిన్న ఫాస్ట్‌పుడ్‌ల పేరుతో, తోపుడుబండ్లపై టిఫిన్, భోజనం వ్యాపారాలు సాగిస్తున్న వాళ్ళయితే తమ వ్యాపారం జరగాలనే ఆతృతతో మూత్రవిసర్జన శాలల పరిసరాల్లో, మురుగుకాల్వల ప్రాంతాల్లో ఏకంగా టిఫిన్ బళ్లను పెట్టుకుని వ్యాపారాలు చేసేస్తున్నారు. యాత్రికుల అవసరాలను క్యాష్ చేసుకునేలా అనధికారికంగా ఎక్కడ బడితే అక్కడ పుట్టగొడుగుల్లా హోటళ్ళు,ఫాస్ట్‌పుడ్ సెంటర్లు వెలిశాయి. వీటిపై నాణ్యత, శుభ్రత పర్యవేక్షించాల్సిన ఆహారభద్రత అధికారులుగానీ, నగరపాలకసంస్థ హెల్త్‌విభాగం గానీ వీరివైపు కన్నెత్తిచూడటం లేదంటే ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. రాజకీయనేతల ఒత్తిళ్ళకు తలొగ్గడం,మామూళ్ళకు అలవాటు పడటం మరీ యాత్రికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తిరుపతి యాత్రాస్థలం కావడంతో వేకువజామున 3గంటల నుండి యాత్రికుల సంచారం మొదలవుతుంది. బస్సుల్లోనో,రైళ్ళలోనో, సొంత వాహనాల్లోనో తిరుపతికి దిగితే ఆ సమయంలో ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో హోటళ్ళు అందుబాటులో ఉంటాయి. వీటిల్లో నాణ్యత మాట దేవుడెరిగినా యాత్రికుల అవసరం, ఆకలితో కడుపునింపుకుంటున్నారని వ్యాపారుల భావన. తిరుపతి నగరంలో పేరున్న హోటళ్ళు యాభైలోపు ఉంటే ఇక చిన్నహోటళ్ళు, ఫాస్ట్‌పుడ్ సెంటర్లు దాదాపు 300పైగా ఉంటాయి. ఒకరోజు వండిన ఆహారపదార్థాలు మిగిలిపోతే రెండు మూడు రోజులు ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వాటిని యాత్రికులకు వడ్డిస్తున్నారంటే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్లే. మరీ తిరుపతిలో మాంసాహార భోజనాలు, బిర్యానీలు తయారుచేసి విక్రయించే హోటళ్ళలో నాణ్యత, :శుభ్రత విస్తుగొల్పుతుంది. తిరుపతిలో హోటళ్ళు, ఫాస్ట్‌పుడ్ సెంటర్‌ల నాణ్యతపై తరచూ తనిఖీ చేయాల్సిన హెల్త్,పుడ్‌సేఫ్టీ అధికారులు రాజకీయ నేతల ఒత్తిళ్ళతో వీటివైపు చూడటం లేదు. ఇప్పటికైనా అధికారులు నగరంలోని హోటళ్ళలో తనిఖీలు చేసి ఆహారపదార్థాల నాణ్యతను పరీక్షించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా నగరపాలక హెల్త్, పుడ్‌సేఫ్టీ అధికారులు చలనం వస్తుందా అనేది చూడాల్సిందే.

# ఇక సంస్థాగత ఎన్నికలు!

## త్వరలో టిడిపి సభ్యత్వ నమోదు షెడ్యూల్



చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారం చేజిక్కించుకున్న తెలుగుదేశం పార్టీ ఇప్పుడు సంస్థాగత ఎన్నికలు నిర్వహించుకుని పార్టీ నిర్మాణంను మరింత పటిష్టం చేసుకోవడానికి సిద్ధమైంది. తెలుగుదేశం పార్టీకి సంబంధించి గ్రామ, మండల కార్యవర్గాల పదవికాలం ముగియడంతో వీటి స్థానాల్లో కన్వీనర్లను నియమించి పార్టీ సభ్యత్వం ప్రక్రియను చేపట్టి పూర్తి చేయడానికి పార్టీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ముందు సభత్వ నమోదు, ఆపై గ్రామ కమిటీల ఎన్నికలు, ఆపై మండల కమిటీలకు ఎన్నికలు, ఆపై జిల్లా కమిటీల ఎన్నికలు, ఆపై రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక వుంటుంది. ప్రస్తుతం వున్న పార్టీ కమిటీల పదవికాలం ముగియడంతో సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగి వుండాలి. ఏప్రిల్ నెలలో మినీ మహానాడులు, మే నెలలో జాతీయ స్థాయి మహానాడు నిర్వహించి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక జరిగి వుండాలి. సార్వత్రిక ఎన్నికల ముందు పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించడానికి వీలు లేకపోవడంతో పార్టీ సంస్థాత ఎన్నికల నిర్వహణ వాయిదా పడింది. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయి పార్టీలో సైతం పార్టీ అధ్యక్షులను జాతీయ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్చివేశారు. ఇది వరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా వున్న అచ్నెమనాయుడు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించడంతో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావును నియమించారు. అలాగే జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా వున్న పులివర్తినాని చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో దానికంటే ముందే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం బిసీ వర్గానికి చెందిన సిఆర్ రాజన్‌ను ఎంపిక చేసింది. చిత్తూరు అసెంబ్లీ స్థానం తెలుగుదేశం అభ్యర్ధిత్వం ఆశించిన సిఆర్ రాజన్‌ను సంతృప్తి పరచడానికి చంద్రగిరి తెలుగుదేశం అభ్యర్థిగా పులివర్తినాని పోటీ చేయడంతో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి పులివర్తి నాని నుండి సిఆర్ రాజన్‌కు అప్పగించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేకపోయిన సమయంలో ప్రస్తుతం గ్రామ, మండల, జిల్లా పార్టీ కార్యవర్గాల్లో ప్రముఖ పదవుల్లో వున్న నేతలందరు పార్టీ కోసం కష్టపడి పని చేశారు. అయితే ఇప్పుడు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ అధికారంలో లేని సమయంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన కొంతమంది నాయకులను పక్కన బెట్టి వారి స్థానంలో పార్టీ పదవులను చేజిక్కించుకుని ఇటు ప్రభుత్వం, అటు పార్టీలో చక్రం తిప్పడానికి కొంత మంది నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో కొన్ని మండలాల్లో బిసీలు అధికంగా వుండటంతో పార్టీ అధ్యక్ష పదవులను సైతం తెలుగుదేశం పార్టీ బిసీలకు కేటాయించగా ఇప్పుడు పార్టీ అధికారంలోకి రావడంతో ఇప్పటి వరకు పార్టీ అధ్యక్షులుగా వున్న బిసీల స్థానంలో ఇతరులు రావడానికి సర్వశక్తులు కేంద్రీకరించారు. ఈ పరిస్థితుల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగిన గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఎవరెవరు పార్టీ బాధ్యతలు చేపడుతారనే విషయంపై ఇటు నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## పుణ్యక్షేత్రంలో రాజకీయాలు మాట్లాడను

### -హోమ్‌మంత్రి అనిత



తిరుమల, జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:

పవిత్రమైన తిరుమల ఆలయ సాంప్రదా యాలను పాటిస్తానని, ఆధ్యాత్మిక క్షేత్రంలో రాజకీయాలు మాట్లాడబోనని రాష్ట్రహోమ్ మంత్రి అనిత స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి ఆమె వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియా ప్రతి నిధులు ఆమెను రాజకీయాలపై వ్యాఖ్యలు చేయాలని కోరగా తాను కేవలం స్వామివారి దర్శనానికి వచ్చా నని, రాజకీయాలు చేయడానికి కాదన్నా రు. రాష్ట్రప్రజలకు అంతా మంచి జరగాలని, చంద్రబాబు, పవన్ కల్యాన్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిదిశగా పనిచేస్తుం దన్నారు. రాజకీయాలు మాట్లాడకపోవడంతో హోమ్ మంత్రి వ్యవహారశైలిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా తిరుమలలో హోమ్‌మంత్రిని కలసి టిడిపి నేతలు సుగుణమ్మ, రాజుయాదవ్, వెంకీ శ్రీవారి చిత్రపటం బహుకరించారు.

## సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ప్రసన్న వేంకటేశ్వరుడు





వడమాలపేట, జూన్ 23 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రసన్న వేంకటేశ్వరుడు ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్య కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు వాహన మండపం చేరుకున్న స్వామివారు సర్వాలంకార భూషితుడై సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. స్వామివారికి భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న అనంతరం ఉభయ దేవేరులతో పాటు స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రెండవ గంట నైవేద్యం అనంతరం సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల పాటు ఊంజల్‌సేవలో పద్మావతీ ఆండాళ్ సమేతంగా శ్రీవారు ఊయలలో కొలువుదీరి భక్తులకు కనువిందు చేశారు. 6.30 గంటలకు వాహన మండపం చేరుకున్న మలయప్పను సర్వంగా సుందరంగా అలంకరించారు. 7 గంటలకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించిన శ్రీవారు పురవీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు, నారికేళాలు సమర్పించి భక్తితో కొలుచుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎం పర్యటనకు పటిష్ఠ భద్రతా చర్యలు

## - ఏర్పాట్లు పరిశీలించిన జె.సి. శ్రీనివాసులు.. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు



కుప్పంలో బహిరంగసభ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెసి, ఎస్పీలు

కుప్పం, జూన్ 23 ప్రభాతవార్త

కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం సిఎం పర్యటన ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. ఈసందర్భంగా సిఎం పర్యటన ప్రాంతాల్లో ట్రయన్ రన్ నిర్వహించారు. స్థానిక పిఇఎస్ వైద్య కళాశాల వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద బ్యారికేడ్ల నిర్మాణం, విఐపిల వాహనాల పార్కింగ్ తదితరాలను పరిశీలించారు. శాంతిపురం మండలం జల్లిగానిపల్లి, చిన్నారిదొడ్డి వద్ద హంద్రీ-నీవా కాలువలను పరిశీలించారు. అనంతరం కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహం, కుప్పం బస్టాండులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగే బహిరంగసభ ఏర్పాట్లు పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. సిఎం పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నియమించిన అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సిఎం పర్యటన సందర్భంగా ట్రాఫిక్, భద్రత ఏర్పాట్లతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డిఎస్పీ శ్రీనాథ్, డ్వామా పిడి రాజశేఖర్, పిఆర్, ఆర్అండ్‌డి ఎస్ఇలు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, ఆర్డీఓలు శ్రీనివాసులు, మనోజ్‌రెడ్డి, చిన్నయ్య, వెంకటరెడ్డి, తహశీల్దార్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సి.ఎం. ఇలాఖాలో పోలీసు అధికారుల బదిలీలు

### - ఇద్దరు సిఐలు..నలుగురు ఎస్సైలు విఆర్‌కు !!

కుప్పం, జూన్ 23 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యంవహిస్తున్న కుప్పం నియోజకవర్గ పరిధిలో ఉన్న పోలీస్ సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న ఆరుమంది పోలీసు అధికారులను బదిలీ చేస్తూ ఆదివారం అనంతపురం రేంజ్ డిఐజి డా॥ షేముషి ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ డివిజన్‌లో ఉన్న ఇద్దరు సిఐలు, నలుగురు ఎస్సైలకు విఆర్‌కు అటాచ్ చేశారు. కుప్పం అర్బన్ సిఐ ఎస్వీరమణ, రూరల్ సిఐ ఈశ్వర్‌రెడ్డిలకు విఆర్‌కు అటాచ్ చేస్తూ అనంతపురం రేంజ్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే రామకుప్పం ఎస్సై శివకుమార్, రాళ్లబూదుగూరు ఎస్సై సుమన్, కుప్పం అర్బన్ ఎస్సై సుబ్బారెడ్డి, గుడుపల్లె ఎస్సై లక్ష్మీకాంత్‌లను చిత్తూరు విఆర్‌కు అటాచ్ చేశారు. కాగా సిఎం చంద్రబాబునాయుడు మంగళ,బుధ వారాల్లో కుప్పంలో పర్యటించనున్న నేపథ్యంలో ఒక్కసారిగా డివిజన్ పరిధిలో ఉన్న ఇద్దరు సిఐలు, నలుగురు ఎస్సైలకు విఆర్‌కు పంపారు. బదిలీ అయిన వారంతా తక్షణం రిలీవ్ కావాలని ఆదేశించారు. కాగా బదిలీ అయిన సిఐలు, ఎస్సైలు సోమవారం విధులనుంచి రిలీవ్ అవుతారని మంగళవారం నాటికల్లా కొత్త పోలీసు అధికారులు విధుల్లో చేరుతారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. త్వరలోనే క్షేత్రస్థాయిలో కానిస్టేబుళ్ల బదిలీలు సైతం డివిజన్ పరిధిలో చోటుచేసుకోనున్నాయి.

# తిరుపతి విద్యార్థులకు 'నీట్'రద్దు కష్టాలు

## -వందలకిలోమీటర్లు వెళ్ళి అవస్థలు



తిరుపతి, జూన్ 23ప్రభాతవార్త:

ఎంబిబిఎస్ ,యుజి వైద్యవిద్యలో ప్రవేశాలకు జాతీయస్థాయిలో నిర్వహించే "నీట్"ప్రవేశ పరీక్ష ఆదివారం జరగాల్సి ఉండటంతో అక్రమాలు జరిగాయంటూ కేంద్రం ఉన్నఫళంగా రద్దుచేసింది. ప్రవేశపరీక్ష రద్దుచేస్తున్నట్లు 24గంటలు ముందు ప్రకటించాల్సి ఉండగా రాత్రికిరాత్రే తీసుకున్న నిర్ణయంతో చాలామంది వరకు విద్యార్థులు పరీక్షాకేంద్రాలకు చేరుకుని కష్టాలు పడ్డారు. ద్వితీయసంవత్సరం ఇంటర్ బైపిసి పూర్తిచేసిన విద్యార్థులు నీట్ పరీక్ష రాయడానికి అర్హులు. ఈ ప్రవేశపరీక్ష జాతీయస్థాయిలో నిర్వహించడం పరిపాటి కావడంతో తిరుపతికి చెందిన విద్యార్థులకు పెద్దసంఖ్యలో నెల్లూరు, ప్రకాశం, ఒంగోలు, విజయవాడ, గుంటూరు నగరాల్లోని కళాశాలలల్లో కేంద్రాలుగా కేటాయించారు. తిరుపతి విద్యార్థులు నీట్ పరీక్షకు సిద్దమై వేలాదిరూపాయలు ఖర్చుచేసుకుని కొందరు శనివారం రాత్రికే ఆయా కేంద్రాలకు వెళ్ళారు. అక్కడ పరీక్షకు సిద్దమై కేంద్రాలు కూడా చూసుకున్నారు. తీరా ఆదివారం ఉదయానికే పరీక్షా పత్రం లీకేజీ పేరుతో నీట్ రద్దుచేసినట్లు సమాచారం పత్రికల్లో రావడంతో దిక్కుతోచని స్థితిలో అయోమయంలో పడ్డారు. కొన్ని వందల కిలోమీటర్లు ప్రయాణించి విద్యార్థులు తీరా పరీక్ష రద్దుతో అష్టకష్టాలు పడ్డారు. వారి తల్లిదండ్రులు కూడా అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పిదాలను 48గటంల ముందు గుర్తించి ప్రకటన చేస్తే విద్యార్థుల మనోభావాలు దెబ్బతినవని పలువురు తల్లిదండ్రులు వాపోయారు.

## ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో ముందడుగు

**– ఎమ్మెల్యే అమరనాధరెడ్డి**



**పలమనేరు, జూన్ 23 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో ముందడుగు వేయాలని ఎమ్మెల్యే అమరనాధరెడ్డి పిలుపునిచ్చారు. పలమనేరు పట్టణం లోని లయన్స్ సేవా కేంద్రంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి శిబిరంను ఎమ్మెల్యే అమరనాధరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాదరెడ్డి మాట్లాడుతూ ఇతరులు సేవ చేయడమే పరమావధిగా లయన్స్ క్లబ్ పని చేస్తుండటం సంతోషించదగ్గ విషయం అన్నారు. పేదలకు సేవ చేయడం ద్వారా కలిగే ఆత్మ సంతృప్తి చెప్పలేనిదన్నారు. పలమనేరులో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని లయన్స్‌క్లబ్ సభ్యులఉ కోరగా దీనికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మాజీ ఎంపి కీర్తిశేషులు రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ ఉచిత కంటి శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పలమనేరు లయన్స్ క్లబ్ సభ్యులు, పలమనేరు, గంగవరం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

**పాకాల, జూన్ 23, ప్రభాతవార్త**



పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు లయన్ మారసాని విజయబాబు తెలిపారు. జూన్ 30వ తేది నాటికి ఇప్పుడు కొనసాగుతున్న కార్యవర్గం కాలం పూర్తి అవుతుందని ప్రకటించారు. అందువల్ల రానున్న లయనిస్టిక్ సంవత్సరం జూలై ఒకటవ తేది నుంచి కొత్త కార్యవర్గం బాధ్యతలు తీసుకుంటుందని వివరించారు. ఈ మేరకు క్లబ్ నూతన అధ్యక్షుడిగా లయన్ కెవిన్ తులసి రామన్, ఉపాధ్యక్షుడిగా మారసాని నాగేంద్ర, కార్యదర్శిగా పోతుగుంట అనీల్ కుమార్, కోశాధికారిగా మారసాని మహేష్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ 2009 నుంచి సేవా కార్యక్రమాలు అందిస్తోందని, నూతన కార్యవర్గం కూడా ఇతోధికంగా పనిచేసి మరింత ఉన్నతంగా సేవలు అందించాలని మారసాని విజయబాబు ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

**పెద్దపంజాణి జూన్23 ప్రభాతవార్త :**



" జనసంఘ్ " పార్టీవ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతిని పెద్దపంజాణి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి పూజలు నిర్వహించారు. జనసంఘ్‌పార్టీ కాలక్రమేనా భారతీయజనతాపార్టీగా రూపాంతరం చెందిందని వక్తలు పేర్కొన్నారు. పదిఏళ్ళుగా ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. అభివృద్ధికి నిబద్ధతకలిగినపార్టీ బిజెపి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలప్రధాన కార్యదర్శి వెంకటరమణ సీనియర్ నాయకులు డా॥ నక్క రామచంద్రయ్య, మండల స్వచ్‌భారత్ అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, జిల్లాకిసాన్‌మోర్చా ఉపాధ్యాక్షులు వెంకటటరామిరెడ్డి, సుబ్రమణ్యయాదవ్, రామన్న, మహేష్, వెంకటరమణ తధితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి సవితను కలసిన కురబ సంఘం నేతలు

**కుప్పం, జూన్ 23 ప్రభాతవార్త**



రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితను కుప్పంకు చెందిన కురబ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరు కున్న మంత్రి సవితకు వారు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సవితను వారు ఘనంగా సత్కరించారు. కురబ కులం తరపున మంత్రి పదవి చేపట్టడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు రామచంద్ర, రాజగోపాల్, లీలా వెంకటేష్, శ్రీనివాసులు, ధనశేఖర్, సంతూరు, కదిరప్ప, బీరేష్, మంజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 32మంది ఎంపిక

**కుప్పంరూరల్, జూన్ 23 ప్రభాతవార్త**



సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శారద కంటి ఆస్పత్రి అధ్వర్యంలో ఆదివారం కుప్పం బాలుర హై స్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 120మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఉచిత కంటి ఆపరేషన్లకు గాను 32మందిని ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారు. కార్యక్రమంలో వైద్య బృందం బాబు, లావణ్య, మట్లార్లపల్లి వీరభద్రప్ప, ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సగిలి షన్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలుతమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని ఆయన తెలిపారు.

## పక్కాగా డయేరియా కట్టడి చర్యలు

**– మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ**



**చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:** స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024 కార్యక్రమం పక్కా నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చిత్తూరు నగర పరిధిలో డయేరియా నియంత్రణ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడానికి కమిషనర్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీలో సహాయక కమీషనర్, ఆర్ఓ, ఎంఇ, సిడిపిఓ, ఎంహెచ్ఓ, ఎంఇఓ, సిఎంఎం అధికారులు వుంటారని, వారు చేపట్టాల్సిన కమీషనర్ దిశా నిర్ధేశం చేశారు.

**టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు నిర్వర్తించాల్సిన విధులు**

**ఎంఇ:** నీటి సరఫరా పర్యవేక్షణ, నీటి నాణ్యత కోసం ఆర్సీహెచ్, ఈకోలై పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించడం, లీకేజీలు నివారించడం.

**సిడిపిఓ:** అంగన్‌వాడీల పర్యవేక్షణ, మూడేళ్ళలోపు పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడటం, గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ వర్కర్లతో సమన్వయం చేసుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం.

**ఎంహెచ్ఓ:** నగరంలో పారిశుధ్య నిర్వహణ, ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ, డ్రైనేజీల్లో పూడిక తీయుట, ఫాగింగ్, స్ప్రేయింగ్, దోమలు, కోటకాల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణ కోసం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం.

**ఎంఇఓ:** పాఠశాలల్లో విద్యార్థులకు చేతులు కడిగే కార్యక్రమాలు నిర్వహించడం, భోజనాలకు ముందు చేతులు కడిగేలా అవగాహన కల్పించడం. పాఠశాలల్లో డయేరియా నియంత్రణ, ఓఆర్ఎస్, జింక్ వినియోగంపై వకృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించడం.

**సిఎంఎం:** స్వయం సహాయక సంఘాల గ్రూపులతో సమన్వయం చేసుకుని వార్డు సచివాలయాలు, రాత్రి వసతి కేంద్రాలు, హోటల్స్ ఇతర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం,

**సహాయక కమీషనర్ అండ్ ఆర్ఓలు:** డయేరియా నియంత్రణ కార్యక్రమాలను అన్ని డివిజన్లలో పకడ్బందీగా నిర్వహించడం, కార్యక్రమాలను రోజువారీగా పర్యవేక్షించడం.

## విద్యార్థుల అభ్యున్నతికి దొరస్వామి సేవలు

**– డిఇఓ దేవరాజులు**

**పాలసముద్రం, జూన్ 23 ప్రభాతవార్త:**



విద్యార్థుల అభ్యున్నతి కోసం తెలుగు పండిట్ దొరస్వామి గత పాతికేళ్లుగా జిల్లాలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వర్తించారని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు పేర్కొన్నారు. పాలసముద్రం మండలం కృష్ణజిమ్మాపురం ఎస్ఆర్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన తెలుగు పండింట్ దొరస్వామి పదవి విరమణ కార్యక్రమానికి ఆదివారం డిఇఓ దేవరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఇఓ దేవరాజులు మాట్లాడుతూ గత 41 సంవత్సరాలుగా దొరస్వామి పాఠశాల స్థాయి విద్యార్థుల అభ్యున్నతి కోసం సర్వశక్తులు ఒడ్డి బోధించారన్నారు. దొరస్వామి వద్ద విద్యనభ్యసించిన విద్యార్థుల్లో ప్రస్తుతం ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరారన్నారు. పదవి విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని అక్షరాలు అందరికి అందాలని తపించి పాఠశాలను పవిత్రంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య వీడదీయని బంధం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా డిఇఓ దొరస్వామి, ఆయన సతీమణి భువనేశ్వరీని డిఇఓ దేవరాజులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఓ చెంగల్‌రాయుడు, ఎంఇఓ-2 గిరిజ, ఎస్టీయు మండల అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యాయులు రఘు, ఏలుమలై, రమేష్‌బాబు, చిన్నరాజు, భూపతి, సునీత, కోదండయ్య, దేవేంద్ర, ఈశ్వరయ్య, రాజేశ్వరీ, కుమార్

## రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పాకాల, జూన్ 23, ప్రభాతవార్త**



పాకాల రైల్వే స్టేషన్‌లో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి రైల్వే ఎపోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రైల్వే స్టేషన్‌లోని మూడో నెంబర్ ప్లాట్ ఫారం నందు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండగా గుర్తించామని ఇతడిని యాచకుడిగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడు బ్లూ కలర్ గల్లచొక్కా, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని అతని వద్ద అంతకుమించిన ఆధారాలేవి లభించలేదన్నారు. ఈ సంఘటనపై రైల్వే ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘననివాళులు

**చిత్తూరురూరల్, జూన్ 23 ప్రభాతవార్త:**



అఖండ్ భారత్ ఐక్యంగా వుండాలని జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ ఆకాంక్షించి ఆ దిశగా పాటుపడ్డారని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు పేర్కొన్నారు. ఆదివారం గాంధీ సర్కిల్ నందు శ్యామ్‌ప్రసాద్ వర్ధంతిని భాజపా సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని పూలతో అలంకరించి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, భాజపా నాయకులు బ్రహ్మానందరెడ్డి, రవికుమార్, గోకుల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు బ్యాంక్ పాస్‌పుస్తకాలు

**చిత్తూరురూరల్, జూన్ 23 ప్రభాతవార్త:** మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతిగృహంలోని నిరాశ్రయులకు పొదుపు, ఆర్థిక లావాదేవిల కోసం ఉచితంగా బ్యాంక్ పాస్ పుస్తకాలను అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు జోసఫ్‌రాజు తెలిపారు. నిరాశ్రయులకు ప్రభుత్వ పథకాల పెన్షన్లు, ఇతర ఆర్థిక లావాదేవిల కోసం ఎంతగానో ఉపయోగపడుతుందనీ, అలాగే నిరాశ్రయులకు బ్యాంక్ అకౌంట్ ప్రారంభించడానికి సహకరించిన ఇండియన్ బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది ప్రమీళ, ఇంద్రాణి, రఘుపతి, శేఖర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణే లక్ష్యం

**– రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ**

**చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ విద్యారంగంను పరిరక్షించుకోవడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ పిలుపునిచ్చారు జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్షుడు ఎం.సోమశేఖర్‌నాయుడు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ జిఓనెం.117 సత్వరం రద్దు చేయాలని, పాఠశాలల విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుండి ఉపశమనం కల్పించి కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు సుధాకర్‌రెడ్డి, పిఆర్ మునిరత్నం, కె.ప్రసన్నకుమార్, సిపి ప్రకాష్, ఎస్‌పి భాషా, ఎ.కృష్ణమూర్తి, కె.రెడ్డప్పనాయుడు, కె.సరిత, ఎం.పార్థసారధి, కె.గణేష్‌కుమార్, సాధన్‌కుమార్, వంశీకృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు మాత్రమే కూల్చివేత

**– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్**

**చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:** వైకాపా ప్రభుత్వంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మించిన భవనాలను మాత్రమే ప్రస్తుత ప్రభుత్వం కూల్చివేస్తోందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ అన్నారు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులుతో కలిసి వెంకిటీల సురేంద్రకుమార్ విలేకరులతో మాట్లాడారు. తాడేపల్లి సర్వేనెం.202/ఎ జలవనరుల శాఖ బోట్ యార్డుకు కేటాయించిన స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా వైకాపా కేంద్ర కార్యాలయం నిర్మించడం జరిగిందన్నారు. జల వనరుల శాఖ అనుమతి లేకపోవడంతోనే తాడేపల్లి మున్సిపల్ శాఖ ఈ ఏడాది మే 20న ఒకసారి, జూన్ 1వ తేదీ మరొకసారి జలవనరుల శాఖ అనుమతి తీసుకోలేదని షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు మాట్లాడుతూ ఈ విషయంపై నిర్మాణాలు చేపడుతున్న సంస్థకు సైతం నోటీసులు జారీ చేయడం జరిగిందని, హైకోర్టు సైతం చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చునని సూచించిందని ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే మురళీమోహన్‌ను కలిసిన ఎపియుడబ్ల్యుజె నాయకులు

**చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:**



పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్‌ను ఆదివారం జిల్లా ఎపియుడబ్ల్యుజె నాయకులు చిత్తూరు ఆర్అండ్‌బి అతిధిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎపియుడబ్ల్యుజె నాయకులు జులై 7న జరుగనున్న ఎపియుడబ్ల్యుజె జిల్లా మహాసభకు ముఖ్య అతిధిగా హాజరు కావాలని ఆహ్వానించారు. దీనిపై ఎమ్మెల్యే సమాధానం ఇస్తూ తప్పకుండా హాజరు అవుతానని తెలిపారు. ఎమ్మెల్యే కలిసి ఆహ్వానించిన వారిలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి అక్కులప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రసాద్, ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యులు మన్నెం చంద్రశేఖర్‌నాయుడు, మురళీకృష్ణ, జిల్లా కన్వీనర్ లోకనాదం తదితరులు వున్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనది

**ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



**వెంకటగిరి, జూన్ 23, ప్రభాతవార్త** ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గౌరవప్రదమైందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి జెడ్పి బాలికలు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసే పదవి విరమణ పొందిన సతీష్ ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఎమ్మెల్యే కురుగొండ్ల, మాజీ ఎమ్మెల్యే సాయి కృష్ణ యాచేంద్ర ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే భాగ్యం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి అన్నిటికన్నా గౌరవ ప్రదమైందని ఈ సందర్భంగా తెలిపారు. విశ్రాంతి పొందిన ఉపాధ్యాయులు సమాజానికి ఉపయోగపడాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సాయి కృష్ణ యాచేంద్ర గురించి మాట్లాడుతూ రాజాలు వెంకటగిరి ప్రాంతంలో ఉన్నతమైన స్థానంలో ఉన్నట్లు తెలిపారు. వారు చేసిన పనులు నేటికి అందరికీ ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సాయి కృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యేగా విజయం సాధించిన రామకృష్ణకు పసుపుతో శుభాకాంక్షలు తెలిపారు. మూడోసారి కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఘనంగా సత్కరించారు. మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ జడ్పిటిసి రామచంద్ర నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి. రాజేశ్వర రావు, నాయకులు ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు

**కోట, జూన్ 23 ప్రభాతవార్త** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సామాగ్రి ఉచితంగా అందించనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఆయా కళాశాలల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో, కొత్తగా ఎంతమంది చేరే అవకాశం ఉందో వివరాలను పంపించాలని సంబంధిత ప్రధానాచార్యులు నుంచి సమాచారం కోరింది. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో 25 కళాశాలల్లో దాదాపు 1500 మంది విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు ఏకరూప దుస్తులు సమకూరనున్నాయి. గతంలో వైకాపా అధికారంలోకి వచ్చాక ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ నిలిపేశారు. ఈ సొమ్మును నాడు నేడు పనులకు వినియోగిస్తున్నట్లు ప్రకటించినా వాటిని పూర్తి స్థాయిలో పూర్తి చేయలేదు. గతంలో తెదేపా హయాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ అమలయ్యాయి. వైకాపా అధికారంలోకి రాగానే వీటిని నిలిపేశారు. దీంతో పేద విద్యార్థులు పాఠ్య పుస్తకాలుకొనుగోలుచేయలేకఇబ్బందిపడ్డారు. రాష్ట్రప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు ఊరట కలిగింది.

## బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు

**జిల్లా అధ్యక్షులు వాసుదేవరావు**

**వెంకటగిరి, జూన్ 23, ప్రభాతవార్త**



బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జి వాసుదేవరావు తెలిపారు. టీవీఎస్ కళ్యాణ సభలో బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నెల్లూరులోని కార్పొరేట్ ఆసుపత్రులలో ఎమర్జెన్సీగా చికిత్స పొందిన వారికి రాయితీ ఇప్పిస్తామని తెలిపారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు తగు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి సంఘం ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ భవనాన్ని కూడా నిర్మించినట్లు తెలిపారు. బ్రాహ్మణుల సంక్షేమ భవనంలో పలు కార్యక్రమాలు చేసుకోవచ్చని చెప్పారు. త్వరలో నూతన కమిటీని కూడా ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కామేశ్వర ప్రసాద్, శ్రీనివాస రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

**బాలాయపల్లి, జూన్ 23, ప్రభాతవార్త**



మండల పరిధిలోని శ్రీ కోదండరామ స్వామి శక్తి కేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా చిత్రపటం వద్ద నివాళులు అర్పించడం జరిగింది. అలాగే శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ గురించి వివరించడం జరిగింది. శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో మోటారు వెహికల్ దగ్ధం

**గూడూరు, జూన్ 23, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధిలో షార్ట్ సర్క్యూట్‌తో మోటారు వెహికల్ దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. గూడూరు అగ్నిమాపక అధికారి చలమయ్య వివరాల మేరకు గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన కిషోర్ అనే వ్యక్తికి చెందిన రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ అని తెలిపారు. పనుల నిమిత్తం ఇంటి నుండి బైక్‌ను బయటకు తీసుకువస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయన్నారు. దీంతో అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి ఫైర్ ఇంజిన్ ద్వారా మంటలను అదుపుచేయడం జరిగిందన్నారు. సుమారు లక్ష రూపాయిల వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

## 10 కుటుంబాలకు ఆర్థిక సాయం

**వాకాడు, జూన్ 23, ప్రభాతవార్త**



వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థికంగా వెనుకబడి, అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్న పది కుటుంబాలకు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులు వారి కుమారుడు మధుకిరణ్ రెడ్డిల ఆర్థిక సౌజన్యంతో 55 వేల రూపాయిల విలువ చేసే ఫల సరుకులు అందజేశారు. సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు అందజేశారు.

## విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌కు సన్మానం

**తడ, జూన్ 23 ప్రభాతవార్త** తడ మండలంలో గత 27 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసిన గంగాధర్‌ను ఆదివారం ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని వాటంబేడుకుప్పానికి చెందిన గంగాధర్ సూళ్లూరుపేట మండలంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆదివారం తడ ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. మండలాధ్యక్షుడు కొళవి రఘు, ఎంఇఓలు సరస్వతి, మల్లికార్జున్‌లతో పాటు పూర్వపు ఎంఇఓ శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, హజరత్, వేనాటి ప్రభాకర్‌రెడ్డి, ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 29, 30 తేదీల్లో కోటమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు

**కోట, జూన్ 23 ప్రభాతవార్త** ఈ నెల 29, 30 తేదీలలో కోటలో వెలసిన శ్రీకోటమ్మ తల్లి గ్రామోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఆదివారం కోటలోని కోటమ్మ ఆలయంలో గ్రామోత్సవాలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల కోర్కెలు తీర్చుతూ అందరికీ ఆరాధ్య దేవతగా కొలువైన శ్రీకోటమ్మ తల్లి గ్రామోత్సవ వేడుకలు ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. 29న ఉదయం 4 గంటలకు సముద్ర స్నానం ఘట్టం జరుగుతుందని, సాయంత్రం 4 గంటలకు కోటలోని తన స్వగృహం నుంచి వందలాదిమంది భక్తులతో, కోలగంపలతో అమనమవారి సారె తీసుకొని మేళతాళాలతో ఊరేగింపుగా అక్కడికి చేరుకుంటుందని తెలిపారు. అదేరోజు రాత్రి సూళ్లూరుపేటకు చెందిన కవిత బృందం భరతనాట్యం, 30న ఆదివారం ఉదయం కోటమ్మ తల్లి గ్రామోత్సవం పరివార దేవతల విగ్రహాలతో తెనాలి బ్యాండు మేళాలతో తప్పెట్లు మంగళ వాయిద్యాలు, బాణా సంచా వేడుకలతో జరుగుతుందన్నారు. 30న సాయంత్రం 6 గంటలకు నాయుడుపేట వారిచే పాటకచ్చేరి జరుగుతుందని తెలిపారు. గ్రామోత్సవాలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, పనబాక దంపతులు, జెసి కుటుంబ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీషిరిడీసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, సభ్యులు ఆవుల సుబ్బయ్య, బాబురావు, కోటేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ గాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మోటార్‌సైకిల్ బోల్తా -ఇద్దరికి తీవ్రగాయాలు ...

**దొరవారిసత్రంలీ, జూన్ 23 ప్రభాతవార్త ;** మండల పరిధిలోని పూలతోట సమీపంలో మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. సేకరించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూళ్ళూరుపేటకు చెందిన రవిబాబు, శివకుమార్‌లు మోటార్‌సైకిల్‌పై కోటకు వెళుతుండగా మార్గమధ్యలో దొరవారిసత్రం మండలం పూలతోట సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న రవిబాబు, శివకుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108 సాయంతో చికిత్సనిమిత్తం సూళ్ళూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిఎం చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి

**– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి**



**శాంతిపురం /రామకుప్పం, జూన్ 23 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, ఆనందరెడ్డిలు కోరారు. ఆదివారం శాంతిపురం, రామకుప్పంలలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం సిఎం చంద్రబాబునాయుడు శాంతిపురం మండలంలోని కర్లగట్ట, చిన్నారిదొడ్డి పంచాయతీల్లో హంద్రీ-నీవా కాలువలు పరిశీలిస్తారన్నారు. కుప్పంలో జరిగే బహిరంగసభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నేతలు ఆంజనేయరెడ్డి, జనార్ధనరెడ్డి, మునస్వామి, నరసింహులు, ఉదయ్‌కుమార్, చలపతి, పత్ర నారాయణ, రామూర్తి, మణి, ఎల్.జయరాంరెడ్డి, రమేష్, బాలు, నాగరాజు, ఉయ్యాలజయరాంరెడ్డి, గోవిందరాజులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చీటీ సొమ్ము అడిగినందుకు దాడి.. పోలీసులకు ఫిర్యాదు



**రామకుప్పం, జూన్ 23 ప్రభాతవార్త** చీటి డబ్బులు అడిగినందుకు దాడి చేసి గాయపరిచారని బాధితుడు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. 89 పెద్దూరుకు చెందిన జీవన్ (29) అనే వ్యక్తి మరో 20మంది సభ్యులతో కలసి చీటీ వేసుకున్నారు. చీటీ చివరి నెల కావడంతో మణి అనే వ్యక్తి నగదు కట్టలేదని చీటి డబ్బులు అడగగా మణి అతని అనుచరులు సూర్య, కిరణ్‌లు తనపై రాళ్లతో దాడి చేశారని జీవన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విశ్రాంతి ఉపాధ్యాయుడికి సన్మానం

**బంగారుపాళ్యం, జూన్ 23 ప్రభాతవార్త:**



స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవి విరమణ చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు కె ఆరుళ్‌మణిని పలువురు ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆరుళ్‌మణి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ ఉపాధ్యక్షులుగా సైతం విధులు నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు వినాయకం, జిల్లా అధ్యక్షులు మురళి, గౌరవ అధ్యక్షులు మునిరత్నం, ఎంఇఓ నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు హాజరై విశ్రాంత ఉపాధ్యాయుడు ఆరుళ్‌మణిని సన్మానించారు. విద్యా వ్యాప్తి కోసం, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆరుళ్‌మణి చిత్తశుద్ధితో కృషి చేశారని ఆరుళ్‌మణిని కొనియాడారు.

## ఈడిక కులస్తులకు మద్యం దుకాణాలు



**బంగారుపాళ్యం, జూన్ 23 ప్రభాతవార్త:** మద్యం వ్యాపారంలో ఈడిగ కులస్తులకు భాగస్వామ్యం కల్పించాలని రాష్ట్ర ఎక్సైజ్, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు ఈడిగ కులస్తులు వినతి చేశారు. ఆదివారం విజయవాడలో మంత్రి కొల్లు రవీంద్రను ఈడిగ కులస్తులు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ప్రచారంలో మద్యం వ్యాపారంలో ఈడిగ కులస్తులను భాగస్వామ్యం చేస్తామని సిఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని మంత్రికి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీత కార్మిక మాజీ చైర్మన్ తాత జయప్రకాష్, జిల్లా ఈడిగ బీసీ సాధికారిత సంస్థ అధ్యక్షుడు బుస్సా నాగరాజు, రెడ్డప్పగౌడు, మురళీ, రాజమాణిక్యం, మండల తెలుగు యువత అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లోని సమస్యలకు అప్పటికప్పుడే పరిష్కారం

శ్రీకాళహస్తి,జూన్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని లైటింగ్, విద్యుత్,మంచినీటి సమస్యల పరిష్కారం పరుగులు తీస్తుంది. ముఖ్యంగా ఆయా వార్డుల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు నిత్యం ప్రజలతో మమేకమై పనులు సాగిస్తున్నారు. ముఖ్యంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాలతో మంచినీరు,లైటింగ్ మురుగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నారు.ఈ నేపథ్యంలో 26వ వార్డులో మంచినీటి సమస్యకు సంబంధించి వార్డు ఇన్‌చార్జి అద్దంకి కిట్టు,యశ్వంత్‌లు ఎంతో కాలంగా మున్సిపల్ నల్లా పని చేయటం లేదని కమిషనర్ దృష్టికి తెచ్చారు.ఇంజనీరింగ్ సిబ్బంది ఆఘమేఘాల మీద హాజరై పరిష్కరించారు.

## తిమ్మసముద్రంలో పొంగళ్ళు: సంబరాలు

శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి సుమారు 8 కిలో మీటర్ల దూరంలోని తిమ్మసముద్రం గ్రామంలో ఆదివారం వైభవంగా పొంగళ్ళు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు తనయుడు ఎస్‌సివి దిలీప్ నాయుడు హాజరయ్యారు. ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఇక్కడ మాతమ్మకు పొంగళ్ళు కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తారు. అంతేకాక శ్రీకాళహస్తి,సత్యవేడు నాయకులను ఆహ్వానించి సంబరాలు జరుపుకుంటారు.ఈ నేపధ్యంలో ఆదివారం జరిగిన పొంగళ్ళకు ఎస్‌సివి దిలిప్‌కు సత్కారాల్లో ముంచెత్తారు. తెలుగుదేశం నాయకులు మాజీ మార్కెటింగ్ కమిటి అధ్యక్షుడు రామాంజలు నాయుడు, ధనంజయులు నాయుడు, సురేష్‌నాయుడు,రాజానాయుడు మునస్వామియాదవ్, ఒళ్ళూరు సర్పంచ్ సురేష్‌నాయుడు, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక కార్యక్రమాల్లో గుంటకింద పల్లి సర్పంచ్

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం గుంటకింద పల్లి సర్పంచ్ పెంచులమ్మ ప్రజా సమస్యలపై స్పందించారు. గత మూడేళ్ళు నిధుల కొరతతో మౌనం వహించిన సర్పంచ్ కొత్తగా ఎంపికైన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనలతో యాక్టివ్ అయ్యారు. ఎంతోకాలంగా గ్రామంలో మంచినీటి సరఫరాకు సంబంధించిన పైప్‌లైన్ సమస్యగా ఉంది. ఈ పంప్ సెట్‌ను రిపేరు చేయించి మంచినీటి సమస్యను పరిష్కరించారు. దాంతో ప్రజలు హర్షించారు.అలాగే తిరుపతి స్విమ్స్ డాక్టర్లతో చర్చించి ఆదివారం గ్రామంలో క్యాన్సర్ వైద్యపరీక్షలు చేయించారు.గ్రామంలో ఎంతో కాలం వెలగని వీధి లైట్లను వెలిగించారు.

## గౌడ సంఘం నూతన కార్యవర్గం

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం గౌడ్ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా గౌడసంక్షేమ సంఘం లీగల్ సలహాదారు ఉదయగిరి మోహన్‌గౌడ్,మాజీ అధ్యక్షులు అత్తిరాల శ్రీరాముడు గౌడ్ కల్లుగీత కార్మికుల సంఘం అధ్యక్షులు టి.బత్తయ్యగౌడ్, యూత్ అధ్యక్షుడు జడపల్లిమునిశేఖర్ సారధ్యంలో సమావేశం జరిపి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గంలో కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డుల జారి కి సంబంధించి చర్చించి జారి చేసారు. శ్రీకాళహస్తి గౌడ్ సంఘం అధ్యక్షుడుగాఅంతటి రమేష్‌బాబు గౌడ్, అధ్యక్షులుగా తిరుకాలఅనందగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యదర్శిగా కోసూరు వెంకటరమణగౌడ్, కార్యనిర్వాహకులు అప్పరాల గణేష్‌గౌడ్, కార్యనిర్వాహక కమిటి సభ్యులుగా 11 మందిని ఎన్నుకున్నారు.

## సచివాలయ శిలాఫలకం ధ్వంసం: గ్రామంలో ఉద్రిక్తత

శ్రీకాళహస్తి రూరల్, జూన్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిమండలం పోలి గ్రామ సచివాలయంకు అమర్చిన శిలాఫలకాన్ని ఆదివారం తెలుగుదేశం నాయకులు ధ్వంసం చేసారు. దాంతో గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు పోలి గ్రామంలో వైకాపా నాయకుడు ఆశోక్‌రెడ్డి తన సొంత స్థలాన్ని సచివాలయానికి అందించారు. అక్కడ ప్రభుత్వ సొమ్ములతో సచివాలయ భవనాలు నిర్మించారు. అయితే ఎంతో విలువైన స్థలం అందించిన ఆశోక్‌రెడ్డి ఆ భవనానికి తన తండ్రి పేరు గంగిరెడ్డి అని పేరు పెట్టారు.ఈ మేరకు శిలాఫలకం కూడా ఏర్పాటు చేసారు. ఆదివారం తెలుగుదేశం కార్యకర్తలు ఈ శిలాఫలకాన్ని ధ్వంసం చేసారు. ఈ భవనాలను ప్రభుత్వం సొమ్ముతో నిర్మించారు కాబట్టి ప్రైవేటు వ్యక్తుల పేరు అవసరం ఏముందంటూ తొలగించారు.దాంతో గ్రామంలో వివాదాలు చోటు చేసుకుంది.

## ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, జూన్ 23 ప్రభాతవార్త



భారతీయజనతాపార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోనే కాకుండా మండలాలు, స్థానిక పాతబస్టాండు వద్ద బిజెపి పట్టణ అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు, తొట్టంబేడు మండలంలో వేదాం.కృష్ణయ్య, రేణిగుంట మండలంలో అధ్యక్షులు జీపాలెం తేజోవతి, శ్రీకాళహస్తి మండలంలో కూనాటి నాగరాజు, ఏర్పేడు మండలంలో బలాజీల నేతృత్వంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ సారధ్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కోలా.ఆనంద్ మాట్లాడుతూ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన భారతీయ జనతాపార్టీ స్థాపించిన ఘనత శ్యాంప్రసాద్‌ముఖర్జీదే అన్నారు. ఎంతో సంపన్న కుటుంబంలో పుట్టిన ఆయన నిరాడంబర జీవితం గడుపుతూ సామాన్య జీవితాన్ని అనుభవిస్తూ ప్రజలతో కలసి రాజకీయ కార్యక్రమాల్లో చురుగ్గాపాల్గొనేవారన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండ్రిగ.ఉమ, ఎస్వీరమణ, అమ్మపాలెంరమణారెడ్డి, పగడాల ప్రతాప్, ఉపాధ్యక్షులు లింగాబత్తిన గోపాల్, జివి.అమర్నాధ్ పెద్దపాలెం రవి ఆచారి, చొక్కాని రవిచంద్ర, ఇమ్మిడిశెట్టి మోహన్, ప్రధాన కార్యదర్శులు మద్దువాసుయాదవ్, పుణ్యండిల్లీకుమార్, కందాటిమునిరాజ, ప్రేమకుమార్‌రెడ్డి,, వెంకటేష్‌రెడ్డి, తండ్లామ్ వెంకటమునిరెడ్డి, టిడిపి నాయకులు లోకేష్, పల్లండిల్లీరెడ్డి, మాధవరం పద్మానాధంరెడ్డి, అప్పిరెడ్డి శివారెడ్డి, మాధవరంహరికృష్ణ, సూరాబిందుకుమార్, కార్తీక్‌రెడ్డి, లోకేష్, శివ, బాలగురవయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హోంశాఖ మంత్రిని కలసిన సిద్దులయ్య

శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త



రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తిరుమల పర్యటనను ముగించుకుని తిరుగు ప్రయాణం లో నెల్లూరుకు వెళ్తుంగా శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపి సీడ్స్ కూడలి వద్ద తెలుగుదేశంపార్టీ యువనాయకుడు వంకాయలసిద్దులయ్య మర్యాదపూర్వకంగా కలసి ఆమెకు శివయ్య తీర్ధప్రసాదాలు అందించారు. కార్యక్రమంలోపలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహన దొంగ అరెస్టు

తొట్టంబేడు, జూన్ 23 ప్రభాతవార్త

టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహన దొంగను అరెస్టుచేసినట్లు సిఐ రారాజు తెలిపారు. కార్వేటినగరం మండలంకు చెందిన బాలాజీ(37) నుంచి 8 ద్విచక్రవాహనాలును స్వాధీనం చేసుకున్నామని,ఇందులో రెండు బండ్లు గుర్తించగా, మరో ఆరుద్విచక్రవాహనాలు ఎవరివో గుర్తించలేదని వాటిని స్టేషన్‌లోనేఉంచామ సిఐ తెలిపారు. ద్విచక్రవాహనదారులు ఎవరివో గుర్తించాక వారికి అందిస్తా మన్నారు.

## ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 23, ప్రభాతవార్త



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులను ఆర్యవైశ్య సంఘం నగర కమిటీ సత్కరించింది. ఆర్యవైశ్య సంఘం పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆయన సతీమణి సత్యవతిలను అభినందించారు. రెండేళ్ళ కాలంలో సంఘం నిర్వహించిన సేవాకార్యక్రమాలను అధ్యక్షులు నరసింహులు వివరించారు. జనసేన గెలుపు ఆర్యవైశ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించి గెలుపులో తమ వంతు కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. తిరుమల శ్రీ వారి దర్శనం ప్రతి నెల రెండవ మంగళవారం స్థానికులకు కల్పించాలని ఆయన కోరారు. ఎన్నికల్లో జనసేన గెలుపుకు కృషి చేసిన35 మందిని సత్కరించారు. ఆర్యవైశ్యులకు ఏ చిన్న సమస్య వచ్చినా ఒక కుటుంబ సభ్యుడుగా పరిష్కారానికి కృషి చేస్తామని ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం తిరుపతి నగర కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి హేమ చంద్ర కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షులు ద్వారక, జనసేన నాయకులు పూసా మాధవరావు, వంశీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అచ్చెంనాయుడును సత్కరించిన రాష్ట్ర బీసీ నేత మునస్వామి యాదవ్

కేవీబీ పురం, జూన్ 23 ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడును అసెంబ్లీ సమావేశం అనంతరం మర్యాదపూర్వకంగా తిరుపతి జిల్లా కేవీబీ పురం మండల టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్‌తో కలసి సత్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి పదవి రావడంతో శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పలుశాఖల మంత్రులను సైతం వీరు కలసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుమల, శ్రీకాళహస్తి దేవస్థానం ప్రసాదాలు అందించారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు, తిరుపతి జిల్లా పాల ఏకిరి సాధికారిక కన్వీనర్ వెంకటకృష్ణయ్య, ఎర్రం దొరబాబునాయుడు(తిమ్మ సముద్రం సర్పంచ్), సురేష్ చౌదరి(ఒల్లూరు సర్పంచ్) తదితర నేతలు ఉన్నారు.

## పంచాయతీ నిధులను దారి మళ్లించిన అధికారులపై చర్యలు తీసుకోండి

విజయపురం, జూన్ 23 ప్రభాతవార్త:



గ్రామ పంచాయతీ నిధులను దారి మళ్లించిన ఉన్నత అధికారులపై విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన విజయపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందని, ఆయనకు సర్పంచ్‌ల సంఘాల తరపున శుభాకాంక్షలు తెలిపారు. నాలుగేళ్లనుంచి రాష్ట్రంలోని 12,918 పంచాయతీలకు కేంద్రప్రభుత్వం 14,15వ ఆర్థిక సంఘాల ద్వారాను, ఉపాధిహామీ పథకం ద్వారాను గ్రామ పంచాయతీలకు వేల కోట్ల రూపాయలు నిధులు పంపితే ఆ నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించి దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శులు కుప్పాల మురళి, చింతా కిరణ్‌యాదవ్, మదనపల్లి రవిరాజులు పలుమార్లు ఉద్యమం చేపట్టామన్నారు.

## జనసంగ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

తిరుపతి హెల్త్, జూన్ 23, ప్రభాతవార్త



జనసంగ్ పార్టీ వ్యవస్థాపకులు భారతీయ జనతా పార్టీ రూపకర్త డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని తిరుపతి బిజెపి గంగమ్మ గుడి శక్తి కేంద్ర ఇంచార్జి గుండాల గోపినాధ్ ఆధ్వర్యంలో తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా విచ్చేసిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుబాల చంద్రశేఖర్ బిజెపి రాయలసీమ అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఉన్నత చదువులు చదివి ఎమ్మెల్యేగా ఎంపిగా కేంద్రమంత్రిగా దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల నాయక్, బిజెపి నాయకులు డిఎంకె గణేష్ నాయుడు, కళావతి, చంగల్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీ, యోగి వేమన వర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం

తిరుపతి విద్య, జూన్ 23, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంకు, యోగి వేమన యూనివర్సిటీ కడపతో అవగాహన ఒప్పందం జరిగింది. ఈ అవగాహన ఒప్పందం పైన ఇరు వర్సిటీల రిజిస్ట్రార్లు ఆచార్య ఎన్ రజిని, ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య మహిళా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి సమక్షంలో అవగాహన ఒప్పందం పైన సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా యోగి వేమన యూనివ ర్సిటీ నుండి ఐటీ సర్వీసెస్ సహకారం పొందనున్నారని ఉపకులపతి ఆచార్య డి. భారతి తెలిపారు.

## సమాచారశాఖ మంత్రి పార్ధసారధికి

టిడిపి నేతల సన్మానం

తిరుపతి,జూన్ 23ప్రభాతవార్త:



రాష్ట్రసమాచార పౌరసంబంధాలు, గృహనిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్ధసారధిని ఆదివారం ఆయన నివాసంలో తిరుపతి టిడిపి నేతలు కలిశారు. తిరుపతికి చెందిన హరికృష్ణయాదవ్, జాతీయ ఓబిసి ఫోరం రాష్ట్రకార్యదర్శి డాక్టర్ భూషణ్ కలసి దుశ్శాలువతో సన్మానించారు. శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా ఎస్ఓఎస్ 60వార్షికోత్సవ దినోత్సవం

ఏర్పేడు,జూన్ 23, ప్రభాతవార్త;



స్థానిక నాగంపల్లి పరిధిలోని ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ 60వ స్థాపక దినోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ స్థాపకులు దివంగత డాక్టర్ హెర్మెన్ మైనర్ జయంతి ఎస్ఓఎస్ ఘనంగా నిర్వహించారు. తిరుపతి ఐజర్ ప్రొఫెసర్,డైరెక్టర్ శాంతాను భట్టాచార్య, ఆర్వీ కుమార్ పాల్గొన్నారు. భారతదేశంలో ఎస్ఓఎస్ ప్రారంభించి అరవై ఏళ్ల పూర్తి చేసుకుంది.తల్లులు పిల్లలు మరియు అతిథులకు ఘనంగా స్వాగతంతో ప్రారంభమైంది. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై తల్లుల యొక్క అంకిత భావంతో వారి కృషిని అభినందించారు. విశేషమైన విద్య ప్రతిభ కనభరచిన అసాధారణ పిల్లలకు అతిధి చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో పిల్లలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యగానాధులు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని వీక్షించిన అధికారులు ముగ్దులయ్యారు. ముఖ్య అతిథిలు మాట్లాడుతూ బలహీనమైన పిల్లలు, కమ్యునిటీలను శక్తి వంతం చెయ్యడంలో వారి అసాధారణమైన పనికోసం సంస్థకు విధి నిస్వార్థ సంరక్షకులు ఎస్ఓఎస్ యొక్క దార్శనికుడు డాక్టర్ హెర్మన్ మైనర్ పుట్టిన రోజును జరుపుకోవడం ఆనంద దాయకమని తెలిపారు. ఎస్ఓఎస్ ఇండియన్ సిఈఓ సుమంత్‌కర్ పర్యవేక్షణలో తల్లీ దండ్రులు లేని పిల్లల్ని అభివృద్దే లక్ష్యంగా విజయం సాధించ దానికి కృషి చేస్తున్నారు. ముఖ్య అతిథిలు విషిష్ట అతిథిదులు ఎస్ఓఎస్ సిబ్బంది తల్లులు, పిల్లలు దితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ గుడిని కూల్చిన వ్యాపారస్థుడు

వార్డులో ఉద్రిక్తత

శ్రీకాళహస్తి,జూన్ 23 ప్రభాతవార్త



ఆధ్యాత్మిక చింతనతో గిరిజనులు నిర్మించుకుంటున్న గంగమ్మ ఆలయాన్ని ఓ వ్యాపారి కూల్చివేసి తన వ్యాపారాన్ని అభివృద్ది చేసుకొనుటకు ప్రయత్నించటంతో వార్డులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివరాలు ఇలా .. మున్సిపల్ పరిధిలోని కుందేటి వారి వీధిలో గిరిజన కాలనీల్లో పాత గంగమ్మ గుడిని తొలగించి కొత్తగా నిర్మించుకుంటున్నారు. ఈ ఆలయానికి పక్కనే వెంకటేశ్ అనే వ్యాపారి స్థలం ఉన్నట్లు చెబుతున్నారు.దాంతో వెంకటేశ్ గిరిజనులతో వివాదపడ్డారు. ఈ స్థలం వివాదం చివరకు రెవెన్యూశాఖ వరకు వెళ్ళింది.ఈ నేపధ్యంలో రెవెన్యూశాఖకు చెందిన సర్వేయర్ హరి సర్వే చేసి ఆలయం నిర్మాణం స్థలంలో రెండు అడుగులు వెంకటేశ్‌కు సంబం ధించినది ఉందని తేల్చారు. కొంత సమయం ఇస్తే తామే తొలగించుకుంటామని సంజాయిషి ఇవ్వగా వెంకటేశ్ రెవెన్యూ అధికారి ముందు అంగీకరించారని చెబుతున్నారు. కానీ వెంకటేష్ అర్ధరాత్రి సమయంలో కొందరు ఆకతాయిలను తీసుకొచ్చిజెసిబితో 60శాతం పూర్తి అయినగుడిని కూల్చివేసారని గిరిజనులు వాపోతున్నారు. వెంకటేశ్‌శెట్టి ఆయన బావమరిది ఆగడాలకు అంతులేకుండా ఉందని వాపోతున్నారు.

## శివయ్య సేవలో చినరాజప్ప

శ్రీకాళహస్తి,జూన్ 23 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పెద్దాపురం శాసనసభ్యుడు నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా ఆదివారం స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండి తులతో స్వాగతం పలికారు.ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటుచేసారు. వారికిదర్శన ఏర్పాట్లను ఆలయ ఎఇఓ సతీష్ మాలిక్ పర్యవేక్షించగా తెలుగుదేశం నాయకులు బి.రేణుకాదేవి,మాజీ కౌన్సిలర్ సుప్రజ, వేలు,ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు పొన్నారావు,కృష్ణవేణి ఆయనకు స్వాగతం పలికారు.ఆలయ వేదపండితులు నారాయణన్ ఆశీర్వదించారు.

## హోం మంత్రికి ఘన స్వాగతం

శ్రీకాళహస్తి,జూన్ 23 ప్రభాతవార్త



రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగల పూడి అనిత కు శ్రీకాళహస్తిలో తెలుగుదేశం కార్యకర్తలు పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారధ్యంలో ఎపి సీడ్స్ కార్యాలయం వద్ద ఘన స్వాగతం పలికారు.హోంశాఖ మంత్రి అనిత తిరుమలేశుని దర్శనం చేసుకొని అమరావతికి కారులో వెళుతున్న సందర్భంగా శ్రీకాళహస్తిలోని ఎపిసీడ్స్ సర్కిల్ వద్ద ఆమెకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో పట్టణ అధ్యక్షుడు స్వాగతం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా అనితకు శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఎప్పకప్పుడు అధికారుల దృష్టికి స్థానిక శాసనసభ్యుని ద్వారా తెలిపి పరిష్కరించాలన్నారు. మరో సారి వచ్చినపుడు శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్త్రీశ్వరుని దర్శించుకుంటానని కార్యకర్తలకు వివరించారు.విజయకుమార్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ రేణుకమ్మ,వంకాయల సిద్దులయ్య తదితరులున్నారు.

# తిరుపతి డివిజన్

## టిడిపి నేత దినకరన్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

నాగలాపురం(నారాయణవనం), జూన్ 23 ప్రభాతవార్త :



నాగలాపురం మండలం వల్లూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఎ దినకరన్ ఆదివారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్‌లు ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపిపి మురళి, ఇళంగోవరెడ్డి, నేతలు కొండూరు బాలరాజు, శ్రీనివాసయాదవ్, రుకేష్, సుబ్రమణ్యంరాజు, ఎస్ఎంఎస్ సురేష్‌బాబు, మహేష్, నల్సన్‌మండేలా, రాము, రాజశేఖర్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలమంగళం ఉత్తరంలో మరమ్మతుకు నోచుకోని చేతిబోర్లు

పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి, తాగునీటికి అవస్థలు పడుతున్న ప్రజలు

నారాయణవనం, జూన్ 23 ప్రభాతవార్త :



మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగ పంచాయతీలో సుమారు 3 చేతిబోర్లు మరమ్మతుకు గురైనప్పటికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడు నెలలుగా పలు ధపాలు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చిన పట్టించుకోకుండా అడిగే వారిపై కార్యదర్శి బెదిరింపులకు దిగుతున్నట్టు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడుతున్నట్టు గుర్తు చేశారు. తనకు ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిందని, త్వరలోనే మరమ్మతు పనులు చేయిస్తానని పంచాయతీ కార్యదర్శి బాల ఆదిత్య ప్రభాతవార్త ప్రతినిధికి వివరణ ఇచ్చారు.

## మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీ పురం, జూన్ 23 ప్రభాతవార్త:



మండలంలోని తిమ్మసముద్రం ఎంఎంవాడలో వెలసిన శ్రీశ్రీశ్రీ రేణుకా మాతమ్మవారి ఆలయంలోని అమ్మవారికి ఆదివారం గ్రామ సర్పంచ్ దొరబాబునాయుడు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సర్పంచ్ ఏర్పాటు చేసిన ఓ విందుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై అమ్మవారి ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బత్తిన, రామాంజులనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.నాయుడు తనయుడు ఎస్.వి.దిలీప్‌నాయుడు, గ్రామ పంచాయతీ సర్పంచ్ దొరబాబునాయుడు, ఎం.మునస్వామియాదవ్, తెరణి జయరాంరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, రాజులకండ్రిగ సర్పంచ్ వెంకటేశులు, రాయపేడు సర్పంచ్ పొన్నూరు బాలాజీ, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, పోలినాయుడు కండ్రిగ భాస్కర్‌నాయుడు, దశరథనాయుడు, కళత్తూరు జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సుబ్బరామయ్య నాయుడు, ఏఎస్ఐ లోకనాథం, పోలీసులు గంగాధరం, కలాం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య తీర్చిన వెల్ఫేర్ సభ్యులు

కేవీబీ పురం, జూన్ 23 ప్రభాతవార్త:

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో కళత్తూరు పంచాయతీలోని కస్తూరిపురం కాలనీలో తాగునీటి సమస్య క్రిస్టియన్ వెల్ఫేర్ సభ్యులు తీర్చారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలంకు కస్తూరిపురం కాలనీలో తాగునీటి సమస్య ఉందని తెలియజేయడంతో వెంటనే ఆయన కేవీబీ పురం మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, రూరల్ క్రిస్టియన్ వెల్ఫేర్ అధ్యక్షులు అన్బులను సంప్రదించి క్రిస్టియన్ వెల్ఫేర్ తరపున బోరు వేశారు. క్రిస్టియన్ వెల్ఫేర్ సభ్యులకు మండల తెలుగుదేశం పార్టీ నాయకులకు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కేవీబీ పురం మండల ఐటీడీపీ కో–ఆర్డినేటర్ వినీత్‌కుమార్,తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ అధ్యక్షులు, కేవీబీ పురం మండల క్లస్టర్ ఇన్‌చార్జి కనపర్తి గోపినాథ్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ రజిత గోవర్ధన్ యాదవ్, సత్యవేడు ఎస్సీ సెల్ అధ్యక్షులు సాదు, బూత్ ఇన్‌చార్జి మధు యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు స్టాలిన్, విమల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు జెండాల విధానాలపై పోరాటం

దేశ హితం కోసం ముఖర్జీ తుదిశ్వాస

బిజెపి చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ రాటకొండ విశ్వనాధ్

చంద్రగిరి, జూన్ 23 ప్రభాతవార్త:



దేశ హితం కోసం రెండు జెండాల విధానాలపై పోరాడుతూ తుదిశ్వాస విడిచిన మహనీయుడు, జనసంఘ్ వ్యవస్థాపకుడు, మాజీ కేంద్ర మంత్రి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బిజెపి చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ రాటకొండ విశ్వనాధ్ కొనియాడారు. చంద్రగిరిలో ఆదివారం ఆయన ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని బిజెపి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భారత్‌లో, జమ్ము కాశ్మీర్‌లో రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానుల విధానం వుండేదన్నారు. ఒకే జెండా, ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని అనే లక్ష్యంతో పోరాడుతున్న ముఖర్జీ 1953లో సరిహద్దును దాటేందుకు యత్నించిన ఆయనను జమ్ము కాశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ నేపధ్యంలో గుండెపోటుకు గురైన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుతూ 2019లో భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుబ్రమణ్యం యాదవ్, మునిగంగిరెడ్డి, నరేష్‌కుమార్ నాయుడు, రామ్మూర్తి,పాల్గొన్నారు.

## పుత్తూరులో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

పుత్తూరురూరల్, జూన్ 23 ప్రభాతవార్త:



రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు శ్యాంప్రసాద్ ముఖర్జీ 71వ వర్ధంతి కార్యక్రమం మండల స్థాయిలో భారతీయ జనతా పార్టీ పుత్తూరు పార్టీ కార్యాలయంలో మండల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పుత్తూరు మండల రూరల్ అధ్యక్షుడు మురళి, మండల ప్రధాన కార్యదర్శి మునస్వామి, మండల ఉపాధ్యక్షుడు మదు, బీజేవైఎం అధ్యక్షుడు ప్రకాష్, యువ మోర్చా నాయకులు సుధాకర్, మోహన్, సీనియర్ నాయకుడు శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అంకాళపరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్లు

పుత్తూరురూరల్, జూన్ 23 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని వేపగుంట గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్ల భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఉత్సవ మూలస్థానం విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పోతురాజు ముగ్గు భక్తులను ఆకట్టుకుంది. అనంతరం గ్రామస్థులు పొంగళ్ల పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భక్తులు వేపాకు చేత పట్టుకుని ఏడు బావుల్లో స్నానమాచరించి పసుపు బట్టలు ధరించి అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి పురవీధుల్లో ఊరేగించారు.

## పాముకాటుకు గురై మహిళ మృతి

పుత్తూరురూరల్, జూన్ 23 ప్రభాతవార్త:

పుత్తూరు మండల పరిధిలోని ఎగువ తిరుమలకుప్పం గ్రామంలో నివాసం ఉన్న ఎం.లక్ష్మమ్మ(65) పాముకాటుకు గురై మృతి చెందింది. గ్రామంలోని కృష్ణుడి దేవాలయం వద్దకు ఆలయాన్ని శుభ్రం చేయడానికి కోసం వెళ్లింది. లక్ష్మమ్మ ఆలయ తలుపులు తీసి లోపలికి వెళ్లి చీపురు తీసుకుని బయటికి రావడానికి ప్రయత్నించింది. అయితే లోపల ఉన్న నాగుపాము కాటు వేసింది. వెంటనే సమీపంలో ఉన్న నగరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేసినా ప్రయోజనం లేకపోవడంతో వెంటనే తిరుపతికి తరలించారు. మార్గమధ్యంలో మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## శ్రీ సరస్వతీ సమాజపు సాంఘిక సేవలు ప్రశంసలు

పుత్తూరురూరల్, జూన్ 23 ప్రభాతవార్త:

సమాజం స్థాపించినప్పటి నుంచి ఎన్ని పనులు ఉన్నా అన్ని కార్యక్రమాలకు సంతోషంగా హాజరు అవుతున్నారని తిరుపతి విద్యాశాఖ అధికారి వి.శేఖర్ తెలిపారు. సమాజపు 20వ సర్వసభ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని సంఘానికి మూలస్తంభంగా ఉన్న ప్రసాద్‌ని అభినందించారు. మరో ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ ఈ సరస్వతీ సమాజం విద్యార్థులకు బోధనా సామగ్రితో పాటు 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ శ్రేణుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి నగదు బహుమతి, మెమెంటోలు ఇచ్చి ప్రోత్సహించడం, పేద అనాథ విద్యార్థిని, ఇంటర్ చదివించడానికి దత్తత తీసుకోవడం లాంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న సంఘం సభ్యులు అభినందనీయులు అన్నారు. సమాజం చేస్తున్న సేవా కార్యక్రమాలను సంఘం సభ్యులు రవిశంకర్, బాలసుబ్రహ్మణ్యం వివరించారు. ఈ సమావేశానికి రామకృష్ణమరాజు అధ్యక్షత వహించగా మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యంలు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో యుగంధర్‌రాజు, కుమారవేలు, పురుషోత్తం, వినోద్‌బాబు, అమరనాథ్, రామ్మోహన్, మురళి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరాజు, సుబ్రహ్మణ్యం ఆచారి, పురుషోత్తంశెట్టి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భర్తపై భార్య హత్యాయత్నం

సూళ్లూరుపేట, జూన్ 23 ప్రభాతవార్త

భర్త వేధింపులను తట్టుకోలేక భార్య అతనిపై హత్యాయత్నానికి ఒడిగట్టిన సంఘటన సూళ్లూరుపేట మండలం ఆబాక గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కారిమేటి ఉదయ్‌కుమార్, మస్తానమ్మను ప్రేమించి పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి తరచూ తాగి వచ్చి ఆమెను కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి భార్యభర్తలకు మధ్య గొడవ జరిగింది. దీంతో మస్తానమ్మ తన భర్తను తాగి ఇంటికి వచ్చి గొడవ చేయవద్దంటూ తీవ్రంగా తిరగబడి ఇంట్లో నుంచి పంపించేసింది. ఆదివారం తిరిగి ఉదయ్‌కుమార్ మద్యం సేవించి బిరాయిని ప్యాకెట్ తీసుకొని ఇంటికి చేరుకున్నాడు. అక్కడ భార్యభర్తల మధ్య మళ్లీ వివాదం చోటుచేసుకొని భార్య మస్తానమ్మ వడల కోసం బాండిల్‌లో ఉంచిన కాగుతున్న నూనెను ఉదయ్‌కుమార్‌పై పోసింది. దీంతో ఉదయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. తక్షణమే అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించినట్లు ఎస్‌ఐ రహీమ్‌రెడ్డి తెలిపారు.

## ఏనుగు దాడిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

బంగారుపాళ్యం, జూన్ 23 ప్రభాతవార్త:

చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగలిఘాట్ వద్ద శనివారం అర్ధరాత్రి ఏనుగు దాడిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఇన్స్‌పెక్టర్ లక్ష్మయ్య వెల్లడించిన వివరాల మేరకు 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మొగిలి ఘాట్ రహదారి ప్రక్కన నడుచుకుంటు వస్తుండగా ఏనుగుల గుంపు దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి దేహంను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఫ్యాంటు, షర్టు ధరించి వున్నాడని, కర్నాటక రాష్ట్రంకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు. ఏనుగుల దాడిలోనే ఈ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది వుంటాడని ఇన్స్‌పెక్టర్ వివరించారు. అయితే ఇతని మృతి పట్ల అటవీశాఖ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి గల కారణాలు తెలియరానున్నాయి.

# గంగమ్మా 'కొండ'ను కాచుకో...!

**-కనిపించని పర్యవేక్షణ**
**-అవస్థల్లో భక్తులు**

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 23 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో పర్యవేక్షణ కొరబడటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. దీంతో నైతిక బాధ్యత వహించి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ నాగరాజరెడ్డి సహా సభ్యులందరూ మూకుమ్మడిగా రాజీనామా చేసారు. అనంతరం ఇఒ చంద్రమౌళి సైతం సెలవుపై వెళ్ళారు. దీనివల్ల గంగమ్మ ఆలయంలో ఎవరికి వారే ఎమునాతీరే అన్నట్లుగా తయారైంది. ఉన్నతాధికారులు కొండకు రాకుండా పోవడంతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఆడిందే ఆటగా కొనసాగుతోందని భక్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ముఖ్యంగా క్యూలైన్లలో మరిన్ని కష్టాలు ఎదుర్కొంటున్నామని వారంటున్నారు. రద్దీ సమయంలో సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనం అందని ద్రాక్షలా తయారైందని వాపోతున్నారు. ఆదివారం రోజుల్లో కొందరు సిబ్బంది విఐపి సేవలకే పరిమితమవుతున్నారనీ, తాము ఉదయం నుంచి క్యూలైన్లలో వేచివున్నప్పటికీ రూ. 200ల క్యూలైన్ల ద్వారా పలువురికి రాజమార్గం ఏర్పాటు చేసి తమకు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. బోయకొండ దేవస్థానంలో దాదాపు 120మంది



పనిచేస్తున్నారు. వారిలో 20మందికి పైగా రెగ్యులర్, మరో 25మంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగా, తక్కిన వారందరూ ఏజెన్సీ నుంచి పనిచేస్తున్నారు. గత 10రోజుల నుంచి ఇటు పాలకవర్గం, అటు ఇఒ స్థాయి అధికారి లేక పోవడంతో కొంతమంది సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. మరికొంత మంది అయితే క్యూలైన్లలో వెళుతున్న భక్తులను బయటకు రమ్మని మరీ ప్రత్యేక మార్గంలో తీసుకెళ్ళి అమ్మవారి దర్శనం చేయిస్తూ వారిని ప్రసన్నం చేసుకొంటున్నారని యాత్రీకులు ఆరోపిస్తున్నారు. కొండపై అన్ని చోట్ల ఇదే తరహా అనుభవాలు ఎదురవుతున్నాయంటున్నారు. శక్తిక్షేత్రంలో ఈనెల 13న హుండీ లెక్కింపు ఉండేది ఇఒస్థాయి అధికారులు లేకపోవడంతో ఈనెల 27కి వాయిదా వేసారు. అయితే పరిస్థితి ఇలాగే కొనసాగితే హుండీ లెక్కింపు ప్రశ్నార్థకంగా మారుతుంది. కాగా ఇప్పటికే హుండీలు పలు చోట్ల నిండిపోయినట్లు తెలుస్తోంది. సాధారణంగా బోయకొండ గంగమ్మ ఆలయానికి కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలి వస్తుంటారు. వారిలో కొందరు అమ్మవారికి ప్రతి ఆదివారం వస్తు, ధన రూపంలో విరాళాలిస్తుంటారు. అయితే గడచిన రెండు ఆదివారాల్లో ఒక్క విరాళం అందని పరిస్థితి నెలకొనింది. వీటితోపాటు ఆలయంలో డ్యూటీల విషయంలో గందరగోళంగా వుంది. అధికారి, సిబ్బంది ఎక్కడ వుంటారో, ఏపని చేస్తున్నారో తెలియని సందిగ్ధముంది. సంబంధిత అధికారులు, యంత్రాగం శక్తిక్షేత్రం బోయకొండలో పరిపాలనను గాడిలో పెట్టాలని స్థానికులు, యాత్రీకులు కోరుతున్నారు.

## వైభవంగా దుర్యోధుడి వధ

**- అగ్నిగుండం తొక్కి మొక్కులు తీర్చుకున్న భక్తులు**



పాలసముద్రం, జూన్ 23 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం కృష్ణజిమ్మాపురం పంచా యతీ కొండం గ్రామం ద్రౌపతమ్మ ధర్మరాజు ఆలయ మహాభారత ఉత్సవాల్లో ఆదివారం దుర్యోధుడి వధ ఘట్టం వైభవంగా ముగిసింది. శ్రీ వెంకటేశ్వర నాటక కళామండలి మేనేజర్ శివ దుర్యోధన వధ ఘట్టాన్ని రక్తికట్టించారు. ధర్మరాజుల గుడి ఆవరణలో బంక మట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు నిర్వహిం చారు. ఆపై దుర్యోధనులు భీమసేనుడు మడుగు నుండి బయటికి రప్పించే సన్నివేశంను ఆకట్టుకొంది. దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధ సన్నివేశాలు, పద్యాలు అందరిని అలరించాయి. భీమసేనుడు దుర్యోధనుడి తోడపై గదతో కొట్టి వధించి రక్తంను ద్రౌపది దేవి కురులకు పూసే పాత్రలకు జీవం పోశారు.

## పారదర్శకంగా ప్రజలకు సేవలు

**అధికారులకు ఎమ్మెల్యే అమరనాధరెడ్డి ఆదేశం**



పలమనేరు, జూన్ 23 ప్రభాతవార్త:

ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హులైన లబ్దిదారులకు అధికారులు పారదర్శకంగా సేవలు అందించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాధరెడ్డి ఆదేశించారు. పలమనేరులో ఎమ్మెల్యే అమరనాధరెడ్డి ఆదివారం హౌసింగ్, ఐసిడిఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎంత మంది లబ్దిదారులకు ఇళ్ళు మంజూరు అయ్యాయి! వాటిలో ఎంత మంది ఇళ్ళు నిర్మించుకున్నారు! ఎంత మంది లబ్దిదారుల బిల్లులు పెండింగ్‌లో వున్నాయి! ఈ బిల్లులు మళ్ళీ చెల్లించాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలి! అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. హౌసింగ్‌లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టి ఎంపిక చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే పలమనేరు నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలను సిడిపిఒ ఇందిరా ప్రియదర్శినిని అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ పిడి పద్మనాభం, డిఇ రమేష్‌రెడ్డి, పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, వి.కోట ఎఇలు వెంకట రాజు, చంద్రారెడ్డి, స్వామిదాసు, వెంకటేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతమ్మ, శారద, నజ్మ, సునీత, ద్రాక్షాయణి, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు జ్యోతి, వెంకటరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా కోదండరాముని రథోత్సవం







టి.పుత్తూరు పురవీధుల్లో రథంపై ఊరేగుతున్న కోదండరాముడు. సాంస్కృతిక కార్యక్రమాలు

తవణంపల్లె, జూన్ 223 ప్రభాతవార్త; మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాములవారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారికి రథోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈనెల 16 నుండి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి రథోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంకు చింతగుంపల కృష్ణమూర్తి నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయ దారులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను, ఉభయాన్ని తీసుకురాగా అర్చకులు స్వామివారి మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పలు రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే మధ్యాహ్నం అలంకరించిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు సీతా లక్ష్మణ సమేత కోదండరాముడు రథంపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. ఈసందర్భంగా అడుగడునా భక్తులు స్వామివారి రథంపై మిరియాలు, బొరుగులు చల్లి నారికేళ కర్పూర హారతులతో మొక్కులను తీర్చుకున్నారు. రథోత్సవం తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో టి.పుత్తూరు పరిసరాలన్ని జనసంద్రంగా మారిపోయాయి. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, గ్రామస్తులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. రద్దీదృష్ట్యా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా తవణంపల్లె పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్



తిరుమలనుండి తిరుపతికెళ్ళే మొదటిఘాట్‌లో వ్యాన్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో భక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రభాతవార్త-తిరుమల

## తిరుమలలో శ్రీరంగం పీఠాధిపతి



తిరుమల, జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీరంగం ఆండవన్ ఆశ్రమం పీఠాధపతి వరాహ మహాదేశికన్ స్వామి శిష్యులతో కలసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు.

## చల్లబడ్డ శ్రీకాళహస్తి

**ఉరుములు మెరుపులతో వర్షం**



శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం చల్లబడింది. గత మూడు రోజులుగా ఎండలు వేసవిని మరిపిస్తున్నాయి. ఓ వైపు ఎండ మరో వైపు రోడ్డుమీదకు వస్తే సెగలతో జనం తల్లడిల్లుతున్నారు. ఇదేమి ఎండలు మహాప్రభో అంటూ లబోదిబో అంటున్నారు. ఓ వైపు రుతుపవనాలు వచ్చేసాయి అని ప్రకటిస్తున్నా ఎండలు దడపుట్టించటం వృద్దులను కలవర పెడుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం సుమారు అర్థగంట పాటు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. భారీ వర్షంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. రోడ్లన్ని జలమయమయ్యాయి.

# జులై నుండి అమలులో కొత్త న్యాయ చట్టాలు

**- కొత్త చట్టాలపై న్యాయాధికారులు అవగాహన పెంపొందించుకుని తీర్పులు**
**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు**




కొత్త చట్టాలపై జరిగిన అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు

చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:

భారత న్యాయశాఖ నూతన చట్టాలను తీసుకురావడంతో పాటు కొన్ని చట్టాలకు పేర్లు మార్చి శిక్షలు, జరిమానాలు పెంచడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. జడ్పీ సమావేశభవనంలో ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అధ్యక్షత విశ్రాంత జడ్జి జివి కృష్ణయ్య, నల్సా యూనివర్సిటీ ప్రొఫెసర్ చరణ్‌తేజ్‌లు జిల్లా న్యాయ అధికారులకు భారతీయ నాగరిక సంరక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్య అదీహిని యం-2023, న్యూ క్రిమినల్ చట్టాలపై రెండవ రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు మాట్లాడుతూ జులై నుండి న్యాయ శాఖలో కొత్త చట్టాలు అమలులోకి రానున్నాయన్నారు. భారతీయ నాగరిత సరక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్య అదీహినియం-2023, భారతీయ న్యాయ శాఖ చట్టాలపై జిల్లా న్యాయ అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. భారత న్యాయశాఖ కొత్త చట్టాలను తీసుకురావడంతో పాటు కొన్ని చట్టాలకు పేర్లు మార్చడం, శిక్షలు, జరిమానాలు పెంచడం జరిగిందన్నారు. భారతీయ న్యాయశాఖ చట్టం-2023 ఇది పూర్వం ఇండియన్ పినల్ కోడ్ 1860గా కలిగి వుండేదన్నారు. ప్రస్తుతం న్యూ క్రిమినల్ లా, భారతీయ న్యాయ సంహిత(బిఎన్ఎస్)-2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత(బిఎన్ఎస్ఎస్)-2023, భారతీయ సాక్ష్య అదీహినియం(బిఎస్ఎ)-2023 అనే కొత్త చట్టాలను భారతీయ న్యాయశాఖ కొత్త చట్టాలు తీసుకువచ్చిందన్నారు. కొత్త చట్టాలు జులై 1 నుండి అమలులోకి రానుండటంతో జిల్లా న్యాయ అధికారులు కొత్త చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకుని అందుకు అనుగుణంగా తీర్పులు ఇవ్వాలని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయ అధికారులకు సూచించారు. ప్రాసిక్యూషన్, బెయిల్, వాయిదాలు, పరిహారంకు సంబంధించి సంస్కరణలపై రిసోర్స్ పర్సన్స్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా న్యాయ అధికారులకు వివరించారు. జిల్లా న్యాయ అధికారులు, రిసోర్స్ పర్సన్స్ న్యూ క్రిమినల్ లాపై వుంటే సందేహాలను ఇంటరాక్షన్ ద్వారా తెలుసుకున్నారు. ఈ సమావేశంలో 1వ అదనపు జిల్లా జడ్జి రమేష్, ఫాక్స్ కోర్టు జిల్లా జడ్జి శాంతి, అదనపు సివిల్ జడ్జి ఎస్‌పిడి వెన్నెల, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మాధవి, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ధర్మారావు, 8వ అదనపు జిల్లా జడ్జి శ్రీదేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి, 4వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ షేక్ బాబుజాన్, స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కీర్తన, న్యాయ మూర్తులు బి.వాణిశ్రీ, విజయసాదది, అరవింద్, ఎస్‌పి రాఘవేంద్రలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలిసిన డాక్టర్ సుధారాణి



తిరుపతి కార్పొరేషన్, జూన్ 23, ప్రభాతవార్త

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను ఆదివారం ఎన్జీవో కాలనీలో మార్యాదపూర్వకంగా సాయి సుధా మల్టీ స్పెషలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, చెంగమనాయుడు కలిశారు. అనంతరం డాక్టర్ సుధారాణి ఎమ్మెల్యేను సన్మానించి, పుష్పగుచ్చం, శ్రీవారి చిత్రపటం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా తమిళ సినీహీరో విజయ్ జన్మదిన వేడుకలు




చిత్తూరురూరల్, జూన్ 23 ప్రభాతవార్త:

తమిళనటుడు, టివికె పార్టీ వ్యవస్థాపకుడు దళపతి విజయ్ జన్మదిన వేడుకలను అభిమానసంఘ అధ్యక్షుడు పురుషోత్తం ఘనంగా నిర్వహించారు. అభిమాన నటుడు ఆశయం మేరకు పాలాభిషేకం, బ్యానర్‌లను నిషేధించి కట్టమంచి నందు మెప్మా ఆద్వర్యంలో నిర్వహిస్తున్న వృద్దాశ్రమంలో వృద్దుల నడుమ కేక్ కట్‌చేసి అన్నదానం చేసారు. ఈ జన్మదిన వేడుకల్లో విజయ్ అభిమానసంఘ అధ్యక్షుడు పురుషోత్తంతో పాటు సంఘ నాయకులు శరత్‌బాబు, అర్జున్, మౌళి, అరవింద్, మదన్, లజీష్, ఆనంద్, నరేంద్ర, అభిమానులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు

**4 ఎర్రచందనం దుంగలు, కారు, మోటారు సైకిల్ స్వాధీనం**



తిరుపతి కార్పొరేషన్, జూన్ 23, ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లును అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, మోటారు సైకిల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్ ఆదేశాల మేరకు డిఎస్పి చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ సురేష్ బాబు టీమ్ శనివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే వారిలో ముగ్గురిని పట్టుకోగలిగారు. వారిని తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయ్ కుమార్ (37), మోహనవేల్ (25), శక్తివేల్ (27)లుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి, ఆదివారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ సిఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కోదండరాముని దర్శించుకున్న పూతలపట్టు ఎమ్మెల్యే



తవణంపల్లె, జూన్ 23 ప్రభాతవార్త:

మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన రథోత్సవంకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకె.బాబులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవం ఉభయదారుడైన చింతగుంపల కృష్ణమూర్తి నాయుడు ఆహ్వానం మేరకు వీరు టి.పుత్తూరు చేరుకుని ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, స్థానిక సర్పంచ్ రవిచంద్రారెడ్డిల అధ్వర్యంలో అర్చకులు ఆలయం వద్ద పూర్ణకుంభం వద్ద స్వాగతం పలికారు. వారికి ఆలయ ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, రథోత్సవం ఉభయదారుడు కృష్ణమూర్తినాయుడులు స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు.

# జూపార్క్ రహదారిలో యదేచ్ఛగా ఎర్రమట్టి దందా

**ఎర్రమట్టిని త్రవేస్తున్న అక్రమదారులు**
**కూలుతున్న ఎర్రచందనం చెట్లు**
**పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు**

తిరుపతి క్రీడ, జూన్ 23, ప్రభాతవార్త

తిరుపతి అలిపిరి నుండి జూ పార్క్ పోయే దారిలో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోనే ఇలాంటి సంఘటన జరుగుతున్నాయి. ఇది ఫారెస్ట్ వాళ్లు ఎన్నో సార్లు చూసిన దానిపై చర్యలు తీసుకోలేదు. రెడ్ శాండిల్ వృక్షం పెరగడానికి ఒక మంచి స్టేజికి రావడానికి సుమారు 30 నుంచి 40 ఏళ్ల వరకు ఉంటుంది. కానీ ఇక్కడ 15 నుండి 20 సంవత్సరాలు ఉన్న చెట్ల చుట్టూ ఉన్న మట్టిని లోడుకొని వెళ్ళిపోతున్నారు. ఈ ట్రాక్టర్లను ఫారెస్ట్ వాళ్ళు చూసిన పట్టించుకునే నాథుడు లేదు ఇది ఎక్కడో కాదు అలిపిరి జూ పార్క్ రహదారిలో ఉన్న క్యాన్సర్ హాస్పిటల్ అరవింద్ హాస్పిటల్ మధ్యలో ఉన్న ఒక దారిది. ఈ దారిలో జరుగుతున్న దందా ఇది ఇదే కాకుండా ట్రాక్టర్‌లో వచ్చిన వృధాలను అక్కడ పోసి అక్కడ ఉన్న ఎర్రమట్టిని లోడుకొనిపోతున్నారు. దీని వల్ల అక్కడ ఉన్నటువంటి రెడ్ శాండిల్ చెట్లు పడిపోయాయి. దీని వల్ల ఫారెస్ట్ అధికారులకు తెలియజేసిన దానిపట్ల అవగాహన ఉన్న లేనట్టుగా ఉంటున్న వీళ్ళని ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఒకటి రెండు ట్రాక్టర్లు పట్టుకున్న దానిపై చిన్న ఫైన్ వేసి వదిలేస్తున్నారు. వీలుపై కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి సంఘటనలు జరగకుండా అడ్డుకునే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు కన్నా కళ్ళు తెరిచి ఫారెస్టు అధికారులు నిజాయితీగా ఒక ప్రకృతిని వెలకట్టలేని ఒక సంపదని కాపాడుకునే అవకాశం ఉంది.

## సమిష్టి కృషితో సమస్యలను పరిష్కరిద్దాం

**- ఎమ్మెల్యే డాక్టర్ థామస్**

శ్రీరంగరాజపురం, జూన్ 23 ప్రభాతవార్త:




ప్రతి ఒక్కరు సమిష్టి కృషితో జిడినెల్లూరు నియోజకవర్గ సమస్యల కృషికి కట్టుబడి విధులు నిర్వహిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పేర్కొన్నారు. మండల కేంద్రం శ్రీరంగరాజపురంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు హాజరై ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను చిత్తశుద్ధితో కృషి చేస్తానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైన పనులను గుర్తించి నాయకులు, కార్యకర్తలు నివేదిక ఇవ్వాలని కోరారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు, జిల్లా పార్టీ నాయకులు గంధమనేని రాజశేఖర్‌నాయుడు, ఉడమలకుర్తి రవిరాజు, కొత్తపల్లిమిట్ట సూరిరెడ్డి, గుండయ్య తదితరులు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను సన్మానించారు.